క్లుప్తంగా

ఘనంగా ఆయుధ పూజ



పూజ చేస్తున్న అదనపు ఈఓ వెంకయ్య చౌదరి

తిరుమల : తిరుమలలోని మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాదం కాంప్లెక్స్‌లో శుక్రవారం ఘనంగా ఆయుధ పూజ నిర్వహించారు. టీటీడీ అడిషనల్ ఈఓ సీహెచ్ వెంకయ్య చౌదరి పాల్గొన్నారు. అన్నప్రసాదాల తయారీకి వినియోగించే యంత్రాలకు పూజలు చేశారు. డిప్యూటీ ఈఓలు రాజేంద్ర, ఆశాజ్యోతి, ప్రత్యేకాధికారి శాస్త్రి పాల్గొన్నారు.

'స్మార్ట్ సిటీ' పనుల పరిశీలన



సూచనలిస్తున్న కమిషనర్ మౌర్య

తిరుపతి సిటీ : తిరుపతి స్మార్ట్ సిటీ ప్రాజెక్టులో భాగంగా నగరంలో చేపట్టిన అభివృద్ధి పనులను స్మార్ట్ సిటీ ఎండీ, కార్పొరేషన్ కమిషనర్ మౌర్య పరిశీలించారు. శుక్రవారం ఈ మేరకు ఇంజినీరింగ్ అధికారులతో కలిసి సిటీ ఆపరేషన్ సెంటర్, ఇండోర్ స్టేడియం, మల్టీలెవల్ కార్ పార్కింగ్ పనులను సందర్శించారు. ఎస్ఈ శ్యామ్‌సుందర్, డీఈలు రాజు, మధుబాబు పాల్గొన్నారు.

సిరులతల్లి సేవలో హిమాచల్ డిప్యూటీ సీఎం



ఆలయం వెలుపల కుటుంబ సమేతంగా ముఖేష్ అగ్నిహోత్రి

చంద్రగిరి(తిరుచానూరు): హిమాచల్ ప్రదేశ్ డిప్యూటీ సీఎం ముఖేష్ అగ్నిహోత్రి కుటుంబ సభ్యులతో కలసి శుక్రవారం తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారిని సేవించుకున్నారు. ఆయనకు ఆలయ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు.

స్కిల్‌తోనే ఉపాధి.. ఉద్యోగం



పుస్తకం ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపల్, అధ్యాపకులు

తిరుపతి సిటీ : స్కిల్ డెవలప్‌మెంట్‌పై విద్యార్థులు దృష్టి సారిస్తేనే మెరుగైన ఉపాధి, ఉద్యోగావకాశాలు ఉంటాయని ఎస్వీసీఈ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.సుధాకర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం కరంబాడిరోడ్డులోని ఎస్వీసీఈ కళాశాలలో ఎలక్ట్రికల్ విద్యార్థుల కోసం ఎలైట్-2024 అసోసియేషన్ ప్రారంభించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత ఆశయాలతో చదువుకుంటే లక్ష్యం చేరుకోవచ్చని సూచించారు. అనంతరం ఎలక్ట్రో మేనియా పుస్తకం ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ తారకేశ్వర్, డీన్ అబ్దుల్ కలామ్ ఆజాద్, విభాగాధిపతి డాక్టర్ లక్ష్మీదేవి, డాక్టర్ కృష్ణారెడ్డి, కె.ప్రతిభ, గిరీష్‌కుమార్ పాల్గొన్నారు.

ఆక్రమణల అడ్డుకట్టకు వినతి

తిరుపతి అర్బన్ : జిల్లాలో యథేచ్ఛగా సాగుతున్న భూ ఆక్రమణలకు అడ్డుకట్ట వేయాలని సీపీఎం నేతలు కోరారు. శుక్రవారం ఈ మేరకు జేసీ శుభం బన్సల్‌కు వినతిపత్రం అందించారు. కూటమి నేతలు కనిపించిన వాగులు, వంకలు, చెరువులను కబ్జా చేసేస్తున్నారని ఆరోపించారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు జయచంద్ర, సాయిలక్ష్మి, సుమన్ పాల్గొన్నారు.

శృంగేరి పీఠం ఉత్తరాధికారిని కలిసిన టీటీడీ ఈఓ



టీటీడీ ఈఓను అనుగ్రహిస్తున్న ఉత్తరాధికారి

తిరుపతి(అలిపిరి): శృంగేరి శారద పీఠం ఉత్తరాధికారి శ్రీ విధు శేఖర భారతీ తీర్థ స్వామీజీని టీటీడీ ఈఓ శ్యామలరావు కలిశారు. శుక్రవారం తిరుపతిలోని శృంగేరి శంకర పీఠంలో స్వామివారి ఆశీస్సులు అందుకున్నారు.

నేటి నుంచి మహతిలో నృత్య, నాటకోత్సవాలు

తిరుపతి కల్చరల్: మహతి కళాక్షేత్రంలో శనివారం నుంచి 19వ తేదీ వరకు నృత్య, నాటక కళా ఉత్సవాలు నిర్వహించనున్నట్టు శ్రీపద్మనాభ నేషనల్ అకాడమీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ అధ్యక్షుడు కస్పా పద్మనాభన్ తెలిపారు. ఆయన శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. ప్రతి రోజూ సాయంత్రం 4 నుంచి రాత్రి 9 గంటల వరకు కళా ప్రదర్శనలు ఉంటాయన్నారు. గుండా గోపీనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పున్నమి తేజం



కపిలతీర్థం పుష్కరిణి వద్ద భక్తుల రద్దీ (ఇన్‌సెట్) స్వామివారు

కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని ఆలయాలకు పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. శివ నామస్మరణతో పులకించారు. పుణ్యస్నానమాచరించి పునీతులయ్యారు. విశేషాలంకరణలో దర్శనమిచ్చిన స్వామి, అమ్మవార్లను సేవించుకుని పరవశించారు. ఉసిరి చెట్టును ప్రత్యేకంగా అర్చించుకుని తన్మయత్వం చెందారు. విశిష్ట దీపాలను వెలిగించి మోక్షప్రదాత కరుణా కటాక్షం అందుకున్నారు. మహిమాన్విత హోమ పూజలను వీక్షించి సకల శుభాలకు ఆహ్వానం పలికారు. పవిత్ర తీర్థ ప్రసాదాలను స్వీకరించి లయకారుని అనుగ్రహం పొందారు.

- దేదీప్యంగా కార్తీక పౌర్ణమి వేడుకలు
- ఆలయాలకు పోటెత్తిన భక్తులు
- విశేషంగా దీపాలు వెలిగించిన మహిళలు
- పుణ్యస్నానాలు ఆచరించిన ప్రజలు

తిరుపతి కల్చరల్ : శ్రీకపిలేశ్వరాలయంలో కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని శుక్రవారం అన్నాభిషేక మహోత్సవం నిర్వహించారు. అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించారు. కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈఓ దేవేంద్రబాబు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా చండీ హోమం

శ్రీతాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో శుక్రవారం శాస్త్రోక్తంగా చండీ హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని ముత్యాలతో అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ ఎ.జయకుమార్, ఆర్‌సీ మునికృష్ణ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో దీపారాధన

కార్తీక మాసం పౌర్ణమి సందర్భంగా కపిలతీర్థం, దేవేంద్ర థియేటర్ వద్ద, మంచినీరు గుంట సమీపంలోని శివాలయాల్లో శివాలయంలో నగరవాసులు భక్తిశ్రద్ధలతో దీపారాధన చేపట్టారు. కపిలతీర్థంలోని మాల్వాడిగుండంలో పుణ్యస్నానాలు ఆచరించి, పరమశివుని సేవించుకున్నారు.

గోవిందునికి గరుడ సేవ

కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని శ్రీగోవిందరాజస్వామి వారు శుక్రవారం రాత్రి గరుడ వాహనంపై కొలువుదీరి మాడ వీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు.

వైభవంగా ముక్కోటి ఉత్సవాలు

చంద్రగిరి : తొండవాడలోని స్వర్ణముఖీ నది ఒడ్డున వెలసిన శ్రీఅగస్త్యేశ్వరస్వామి ఆలయానికి రుద్రపాదాల ముక్కోటి, కార్తీక పౌర్ణమి సందర్భంగా భక్తులు పోటెత్తారు. ఉదయం అగస్త్యమహామునికి అభిషేకం నిర్వహించారు. స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం అన్నదానం చేపట్టారు. రాత్రి స్వామి, అమ్మవార్లు నంది వాహనంపై ఆసీనులై ఊరేగారు. ఆలయ ఆవరణలో టీటీడీ దాససాహిత్య ప్రాజెక్టుకు చెందిన గాయకుల ఆలపించిన భక్తి గేయాలు అలరించాయి. సీఐ రామచంద్రారెడ్డి నేతృత్వంలో గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు.

వేడుకగా దీపోత్సవం

రామచంద్రాపురం: మండలంలోని యోగుల పర్వతంపై వేడుకగా కార్తీక దీపోత్సవం నిర్వహించారు. ఏకవీర ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ప్రతాప్ స్వామిజీ ఆధ్వర్యంలో 1,503 కిలోల ఆవు నెయ్యి, 2007 మీటర్ల ఒత్తు, 6 అడుగుల రాగి ప్రమిదలో సుమారు 40 కిలోమీటర్ల కనిపించే మేర యోగుల పర్వతంపై కార్తీక దీపం వెలిగించారు. అనంతరం శ్రీసిద్ధేశ్వర స్వామి, సుబ్రహ్మణ్య స్వామి, నాగదేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. భక్తుల చేపట్టిన కోలాటాలు, చెక్కభజనలు ఆకట్టుకున్నాయి. అలాగే రాయలచెరువు సమీపంలోని జలకంఠేశ్వర ఆలయం వద్ద భక్తులు దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు.

పుట్టాలమ్మ ఆలయంలో..

చంద్రగిరి కొత్తపేటలోని శ్రీశ్యామలాంబ సమేత మల్లేశ్వరాలయం(పుట్టాలమ్మ)లో కార్తీక పౌర్ణమి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. స్వామివారికి అన్నాభిషేకం చేసి, ముత్యాలతో అలంకరించారు. అనంతరం అర్చకుడు శివకుమార్ శర్మ ఆధ్వర్యంలో కనులపండువగా కల్యాణోత్సవం జరిపించారు.

గుర్రప్పస్వామి ఆలయంలో..

పాకాల : మండలంలోని ఉప్పరపల్లె పంచాయతీ సూరినేనివారిపల్లెలో ఉన్న గుర్రప్పస్వామి ఆలయంలో ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. అనంతరం రుద్రాభిషేకం, బిల్వార్చన, లలితా పరమేశ్వరి దేవికి లక్ష కుంకుమార్చన, అన్నాభిషేకం చేపట్టారు. సావిత్రి, పురుషోత్తమనాయుడు, రాజేశ్వరి, సుబ్రమణ్యంనాయుడు, ఇచ్చిన స్వామి నాయుడు, నిశ్చిత లావణ్య, విద్యాసాగర్, శ్రీరామనేని మునెమ్మ కుటుంబ సభ్యులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. ఆలయ కమిటీ చైర్మన్ సూరినేని బుజ్జిబాబు నాయుడు పాల్గొన్నారు.



కపిలతీర్థం పుష్కరిణిలో దీపాలు వదులుతున్న మహిళలు, అన్నలింగ ఉద్వాసన చేపడుతున్న అర్చకులు, దీపారాధన చేస్తున్న భక్తులు, యోగుల పర్వతంపై కార్తీక దీపం వెలిగిస్తున్న ప్రతాప్ స్వామిజీ, గరుడ వాహనంపై ఊరేగుతున్న గోవిందరాజస్వామి

విచ్చలవిడిగా బెల్ట్‌షాపులు

- చంద్రగిరిలో ఇష్టారాజ్యంగా మద్యం విక్రయాలు
- కమీషన్ కోసం ఓ ప్రజాప్రతినిధి అక్రమాలు
- పట్టించుకోని ఎక్సైజ్, పోలీసు అధికారులు
- నిబంధనలను బేఖాతర్ చేస్తున్న పచ్చ నేతలు



సాక్షి టాస్క్‌ఫోర్స్ : బెల్ట్‌షాపులు నిర్వహిస్తే బెండు తీయాలని, క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. అయితే చంద్రగిరి నియోజకవర్గంలో మాత్రం అధికార పార్టీ నేతలే నిబంధనలను బేఖాతర్ చేస్తున్నారు. ఓ ప్రజాప్రతినిధితో స్థానిక నేత 30 శాతం కమీషన్‌కు డీల్ కుదుర్చుకుని విచ్చలవిడిగా బెల్ట్ దుకాణాలు ఏర్పాటు చేసుకున్నాడు. పట్టణంలో పేరుకు ఉన్నది ఒక్క వైన్‌షాపు మాత్రమే అయినా వీధి వీధిలో మద్యం ఏరులై పారుతోంది. ఎక్సైజ్, పోలీసు స్టేషన్‌లకు కూతవేటు దూరంలోనే సదరు నేత బెల్ట్ షాపులు నిర్వహిస్తుండడం గమనార్హం. అక్కడే నింపాదిగా కూర్చుని మద్యం తాగేందుకు సకల వసతులు కల్పించడం విశేషం.

సిండికేట్‌గా ఏర్పడి..

ఇటీవల నిర్వహించిన మద్యం దుకాణాల టెండర్లలో మండలంలోని పచ్చనేతలు సిండికేట్‌గా ఏర్పడి సుమారు 33 దరఖాస్తులు వేశారు. అయితే వారికి కేవలం ఒక్క దుకాణం మాత్రమే దక్కింది. అయితే 33 మంది భాగస్వామ్యంతో షాపు నిర్వహిస్తే ఆదాయం ఉండదని, 13 మంది మాత్రమే పార్టనర్లుగా మారారు.

ఇక్కడే అధిక ఆదాయం

చంద్రగిరి పట్టణంలో ఏర్పాటు చేసిన మద్యం దుకాణం ద్వారా వచ్చే మొత్తం కంటే బెల్ట్‌షాపుల ద్వారా అధిక ఆదాయం వస్తున్నట్లు తెలిసింది. చంద్రగిరిలోని దుకాణంలో సరాసరి రోజుకు రూ.3లక్షల వ్యాపారం జరిగితే, బెల్ట్‌షాపుల ద్వారా రూ.4లక్షల వరకు వస్తున్నట్లు సమాచారం. ఈ వైన్‌షాపు నుంచే మండలంలోని అన్ని బెల్ట్ దుకాణాలకు మద్యం సరఫరా అవుతున్నట్లు పలువురు బహిరంగంగానే వ్యాఖ్యానిస్తున్నారు. ఓ ప్రజాప్రతినిధి కనుసన్నల్లోనే మొత్తం వ్యవహారం నడుస్తున్నట్లు తెలుస్తోంది. చంద్రగిరితో పాటు కోట, అగరాల, ఐతేపల్లె, కల్‌రోడ్డుపల్లె, ముంగళిపట్టు, పనపాకం వరకు ఇక్కడ నుంచే మద్యం సరఫరా చేస్తున్నట్లుగా ఆ పార్టీ నాయకులే చెబుతున్నారు.

ఎక్కడెక్కడంటే..?

చంద్రగిరిలోని మద్యం దుకాణానికి చెందిన ఓ టీడీపీ నేత పర్యవేక్షణలో బెల్ట్‌షాపుల ద్వారా మద్యం విక్రయాలు సాగిస్తున్నారు. బీడీ కాలనీలో ఓ మైనార్టీ నేత జోరుగా అమ్మకాలు చేపడుతున్నారు. బీడీ కాలనీ, అక్కగార్లకాలనీలో తండ్రీ, కొడుకులు నిర్వహిస్తున్నారు. అక్కగార్లకాలనీ మార్గంలోని ఓ ప్రైవేటు స్కూల్ సమీపంలోని దుకాణంలో బెల్టు నిర్వహిస్తున్నారు. నూకలగుంట మార్గంలో ఇద్దరు వ్యక్తులు పోటాపోటీగా మద్యం విక్రయాలు చేస్తున్నారు. ఇక్కడ బెల్టు దుకాణంతో పాటు మందుబాబులకు సకల సౌకర్యాలతో షెడ్లు ఏర్పాటు చేశారని స్థానికులు మండిపడుతున్నారు. కొత్తపేటలోని ఓ దుకాణం మాటున విచ్చలవిడిగా మద్యం విక్రయాలను సాగిస్తున్నారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం

చంద్రగిరి : పుస్తక పఠనంతో అంతులేని విజ్ఞానం మన సొంతమవుతుందని ఉపాధ్యాయుడు రాజశేఖర్ తెలిపారు. గ్రంథాలయాల వారోత్సవాలను శుక్రవారం చంద్రగిరి పాతపేటలోని లైబ్రరీలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు, స్థానికులకు గ్రంథాలయాల ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ రెడ్డెమ్మ పాల్గొన్నారు.



చంద్రగిరి : పుస్తకాలను పరిశీలిస్తున్న పురవాసులు



పాకాలలో..

పాకాల : మండలంలోని దామలచెరువు శాఖా గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన నిర్వహించారు. ఇన్‌చార్జి గ్రంథాలయాధికారి పున్నాగు మురళీబాబు మాట్లాడుతూ తమ లైబ్రరీలో నీతి కథలు, ఫన్నీ స్టోరీస్, వేమన పద్యాలు, డిక్షనరీలు, రామాయణం, మహాభారతం, పెద్ద బాలశిక్ష, న్యూస్ పేపర్స్, పోటీ పరీక్షలకు కావాల్సిన మెటీరియల్స్, గ్రూప్-1, గ్రూప్-2, , బ్యాంకు, రైల్వే, గురుకుల, నవోదయ పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని వివరించారు. కార్యక్రమంలో స్థానిక నేతలు రఘుపతి నాయుడు, చంద్రబాబునాయుడు, గ్రంథాలయ సిబ్బంది చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఘనంగా బిస్సా ముండా జయంతి

తిరుపతి గాంధీ రోడ్డు : స్వాతంత్ర్య సమరయోధుడు భగవాన్ బిస్సా ముండా జయంతిని శుక్రవారం స్థానిక బీజేపీ నేతలు ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీజేపీ నేత గుండాల గోపీనాథ్ రెడ్డి మాట్లాడుతూ ఆదివాసీల హక్కుల కోసం నిరంతరం పోరాడిన యోధుడు బిస్సా ముండా అని కొనియాడారు. స్వాతంత్రోద్యమంలో జైలుకు సైతం వెళ్లారని తెలిపారు. కార్యక్రమంలో నేతలు మల్లారపు రవి ప్రసాద్, తొండమనాటి సుబ్రమణ్యంరెడ్డి, తిమ్మిశెట్టి చంద్రశేఖర్ రాయల్, విగ్రహాల కల్యాణి, రాజశేఖర్ రెడ్డి, లక్ష్మయ్య, రహీమ్, వాసు, చంగల్రాయులు, గురు ప్రసాద్, కేఎస్ రాజా, కస్పా పద్మనాభం పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న బీజేపీ నేతలు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చంద్రగిరి : మండలంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా శనివారం కరెంట్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఈఈ వాసురెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కూచువారిపల్లె, రామిరెడ్డిపల్లె, ఇండస్ట్రియల్ పార్క్, ఏ.రంగంపేట, పుల్లయ్యగారిపల్లె, కొటాల, బీమవరం, నారావారిపల్లె, శేషాపురంలో విద్యుత్ సరఫరా ఉండదని వివరించారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

టీటీడీ చైర్మన్‌ను కలిసిన కలెక్టర్

తిరుమల : టీటీడీ బోర్డు చైర్మన్ బీఆర్ నాయుడును కలెక్టర్ వెంకటేశ్వర్ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. మొక్కను అందించి శుభాకాంక్షలు తెలిపారు.



టీటీడీ చైర్మన్‌కు మొక్క అందిస్తున్న కలెక్టర్

ఏనుగుల దాడిలో పంటల ధ్వంసం



ఏనుగులు నాశనం చేసిన బీర తోట

పాకాల : మండలంలోని పదిపుట్లబైలు పంచాయతీ పుల్లావాండ్లపల్లెలో గురువారం రాత్రి ఏనుగులు పంటపొలాలపై దాడి చేశాయి. వరి, అరటి, కాకర, బీర, మామిడి తోటలను ధ్వంసం చేశాయి. శుక్రవారం ఈ మేరకు బాధిత రైతులు మాట్లాడుతూ అటవీశాఖ అధికారులు స్పందించి ఏనుగులను దారి మళ్లించాలని కోరారు. నష్ట పరిహారం ఇప్పించాలని విన్నవించారు.

ఉత్తమ అధ్యాపకులకు సత్కారం



సుచరితను సన్మానిస్తున్న అధికారులు



రాజశేఖర్‌ను సత్కరిస్తున్న వర్సిటీ అధికారులు

తిరుపతి సిటీ : ఉత్తమ అధ్యాపక అవార్డులు అందుకున్న ఎస్వీయూ ప్రొఫెసర్లను వీసీ సీహెచ్ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతినాయుడు శుక్రవారం ఘనంగా సత్కరించారు. వారు మాట్లాడుతూ బోధన, పరిశోధనలలో విశిష్ట సేవలకు గుర్తింపుగా హోమ్‌సైన్స్ అధ్యాపకులు కె.సుచరిత, జువాలజీ ప్రొఫెసర్ ఎం.రాజశేఖర్‌కు ఉత్తమ అధ్యాపకులుగా రాష్ట్ర ప్రభుత్వం అవార్డు ప్రదానం చేయడం సంతోషంగా ఉందన్నారు.

పాకాల డిగ్రీ కళాశాలలో..

పాకాల : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉత్తమ అధ్యాపకుడిగా అవార్డు అందుకున్న డాక్టర్ ఎస్వీ రమేష్‌కుమార్‌ను ఘనంగా సత్కరించారు. ప్రిన్సిపల్ డాక్టర్ మొహిద్దీన్‌బాషా మాట్లాడుతూ తమ కళాశాల ఆంగ్ల అధ్యాపకుడికి పురస్కారం రావడం సంతోషకరమన్నారు. కళాశాల పూర్వ ప్రిన్సిపల్ దామోదరనాయుడు, బాలుర జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఉమామహేశ్వరి, జీసీజీటీఏ రాష్ట్ర అధ్యక్షులు నరసింహులు, పార్థసారథినాయుడు పాల్గొన్నారు.



పాకాల : రమేష్‌కుమార్‌ను సత్కరిస్తున్న అధ్యాపకులు

శ్రీవారి సేవలో ప్రముఖులు



శ్రీవారి ఆలయం వెలుపల కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుమల : తిరుమల శ్రీవారిని శుక్రవారం పలువురు ప్రముఖులు సేవించుకున్నారు. వీరిలో కలెక్టర్ వెంకటేశ్వర్, సినీ నటుడు విష్వక్సేన్, నటి అదితీగోవిత్రికర్ ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనం ఇచ్చారు. టీటీడీ అధికారులు ఘనంగా లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

అభివృద్ధి ప్రణాళికపై శిక్షణ

చంద్రగిరి : ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం పంచాయతీ, మండల అభివృద్ధి ప్రణాళిక(జీపీడీపీ, పీపీడీపీ)పై వైస్ ఎంపీపీ వెంకటరత్నం అధ్యక్షతన సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, కార్యదర్శులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ముందుగా గాంధీజీ చిత్రపటానికి నివాళులర్పించి తరగతులు ప్రారంభించారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ శేఖర్ మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘం, ఎన్ఆర్ఈజీఎస్, ఇతర శాఖలకు వచ్చే నిధులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. పంచాయతీలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, సమస్యలపై గ్రామస్తులతో చర్చించి, ప్రధాన సమస్యల పరిష్కారం కోసం ఆ నిధులు వినియోగించుకోవాల్సి ఉంటుందన్నారు. పంచాయతీలో ఆర్థిక వనరులను గుర్తించి, వాటిని సమకూర్చుకోవాలని సూచించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో అభివృద్ధి పనులు పూర్తి చేసేందుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో కో-ఆప్షన్ సభ్యుడు ఔరంగజేబు పాల్గొన్నారు.

రామచంద్రాపురం: అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పంచాయతీల అభివృద్ధికి కృషి చేయాలని ఎంపీపీ బ్రహ్మానందరెడ్డి కోరారు. ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో అభివృద్ధి ప్రణాళికపై రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎంపీడీఓ ఇందిరమ్మ మాట్లాడుతూ ప్రణాళికపై అవగాహన అవసరమని తెలిపారు. రిసోర్సు పర్సన్లు కిశోర్, వెన్నెల, మనోజ్ శిక్షణ ఇచ్చారు.

పాకాల : మండల పరిషత్ కార్యాలయంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ శశిరేఖ ఆధ్వర్యంలో ప్రజాప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులకు, సర్పంచులకు, స్వయం సహాయక సంఘం సభ్యులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. డీఎల్‌పీఓ రూపారాణి మాట్లాడుతూ పంచాయతీ నిధులను సద్వినియోగం చేసుకోవడంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ లోకనాథం, జెడ్పీటీసీ సభ్యులు నంగా పద్మజారెడ్డి పాల్గొన్నారు.



పాకాల : మాట్లాడుతున్న డీఎల్‌పీఓ రూపారాణి

రూరల్‌లో నేడు..

తిరుపతి రూరల్: మండల పరిషత్ అభివృద్ధి ప్రణాళిక(బీపీడీపీ)రూపకల్పనపై శనివారం శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు తిరుపతి రూరల్ ఎంపీడీఓ రామచంద్ర తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఎంపీడీఓ కార్యాలయంలో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించనున్న శిక్షణ కార్యక్రమానికి ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, అధికారులు, గ్రామ సమాఖ్య లీడర్లు, తప్పక హాజరు కావాలని కోరారు.





గాంధీజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీడీఓ, రామచంద్రాపురం: మాట్లాడుతున్న ఎంపీడీఓ ఇందిరమ్మ